ఇంకా పన్నెండు గంటలేనా! ఎప్పటికి అయిపోతుందీ పాడు టైమూ? ఇంకెన్ని గంటలు తను ఈ జైల్లో వుండాలి? అనుకుంటు వేళ్ళ మీద లెక్క వేశాడు సూరి. అంటే కనీసం ఇంకో పది గంటల పాటూ వుండాలన్న మాట. ఇన్నాళ్ళూ నెలల్నీ, వారాల్నీ, రోజుల్నీ లెక్క పెడుతున్న సూరి, ఇప్పుడు గంటల్ని లెక్క పెడుతున్నాడు.

ఇక తను ఈ జైల్లో వుండవలసింది పది గంటలే అని అనుకుంటూ వుంటే నిద్రాదేవి మరీ దూరంగా పరిగెత్తుతోంది.

తను విడుదల అవగానే ఇంటికెళ్ళి అమ్మకు కనిపించాలి. ఎంత సంతోష పడుతుందో - పోయిన శనివారం నాడు తనని చూడ్డానికి వచ్చి వకటే ఏడ్చింది. తన కెంతో ఇష్టమని గుత్తి వంకాయ కూరా, జొన్న రొట్టెలూ తీసుకుని వచ్చింది. ఒక జత బట్టలూ, ఐదు రూపాయలు ఇచ్చింది కూడా.

ఊహించని విధంగా తనకు రెండున్నర నెలలు సామాన్య జైలు శిక్ష వేశారు కోర్టు వారు.

జైలులో వున్న రిమాండు కాలాన్ని శిక్షా కాలం నుంచి తీసివేస్తే కేవలం వారం రోజులు మాత్రమే జైలు శిక్ష అనుభవించాలి తను. అది కూడా ఆ మరుసటి రోజుతో పూర్తవుతుంది.

అంతవరకూ మాటాడుకుంటున్న అంజనేయులూ, జాఫర్‌లు అప్పుడే గురకలు పెట్టి నిద్ర పోతూ వున్నారు. జాఫర్ని అలా చూసినప్పుడల్లా సూరికి భలే ఆశ్చర్యం- "భయంకరమైన జీవితాన్ని గుండెల్లో దాచుకుని నిశ్చింతగా ఎలా నిద్ర పోగలుగుతున్నాడా!" అని.

"కృష్ణా నీ బారో...." అంటూ కమ్మటి గొంతుతో పాడుతున్నాడు పదిహేనో నెంబరు సెల్లులో వుంటున్న సాధువు. సాధువుది కన్నడ దేశం.

